# మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోంది!

పేదవారు ఆర్థికలేమి వల్ల, వనరుల లేమి వల్ల తమ యోగ్యతను, సృజనశక్తిని సంపూర్ణంగా పెంచుకొనే అవకాశాన్ని కోల్పోతారు. దళితులు కులం కట్టిన అడ్డుగోడల వల్ల; పేదరికం వల్ల కూడా కోల్పోతారు. స్త్రీలు కుటుంబం, బయటి ప్రపంచం అనే వర్గీకరణ వల్ల, అందులోనుండి పుట్టిన పని విభజన వల్ల, వనరులపై హక్కు లేకపోవడం వల్ల కోల్పోతారు. కుటుంబం, బయటి ప్రపంచం అనే వర్గీకరణ స్త్రీల దుస్థితికి ఒక ముఖ్య ప్రాతిపదిక అని చెప్పుకోవచ్చు. స్త్రీ జీవితానికి కుటుంబం పరిధిని నిర్ణయిస్తే, స్త్రీల హక్కులకు, స్వేచ్ఛకు కుటుంబ విలువలు, కుటుంబ ప్రయోజనాలు, కుటుంబ అవసరాలుగా భావించబడేవి పరిధిని నిర్ణయిస్తాయి. అలాగని ఆ కుటుంబం సమాన వ్యవస్థ కూడా కాదు. అందులో ఆస్తి, పనివిభజన, లైంగిక నియమాల విషయాల్లోనూ మగవాళ్ళే ప్రథమ పౌరులు.

హైందవ సమాజంలో స్త్రీ, పురుష సంబంధాలు వర్ణాశ్రమధర్మంలో అంతర్భాగంగా నిర్వచించబడ్డాయి. కాబట్టి పురుషాధిక్యతలో సార్వత్రికంగా ఉండే లక్షణాలతో పాటు వర్ణధర్మం నుండి సంక్రమించిన లక్షణాలు కూడా హైందవ కుటుంబవ్యవస్థలో కనిపిస్తాయి. వర్ణ సాంకర్య భయం స్త్రీపై పెట్టిన లైంగిక నియమాలను మరింత కఠినం చేసింది. స్త్రీలు శూద్రులేనన్న మనునీతి ఫలితంగా చదువుకొనే హక్కు బ్రాహ్మణ స్త్రీలకు సైతం లేకపోయింది. చదువుకొంటే బయటి ప్రపంచానికి ద్వారాలు తెరుచుకొంటాయన్న విశ్వాసం వల్ల స్త్రీ విద్య ఒక ముఖ్యమైన సంస్కరణాత్మక కృషి అయింది. అయినప్పటికీ బయటి ప్రపంచం ద్వారాలు మూసివుండడానికి కారణం స్త్రీ అవిద్యే కాదు. కాబట్టి ఇంకా జరగవలసిన పని చాలా మిగిలిపోయింది. అన్ని రంగాల్లోనూ ఆ కృషి ఇంకా కొనసాగుతూనే ఉంది. వనరులపైన సమానహక్కు, పనివిభజనలో సమూలమైన మార్పు, వ్యక్తిగత స్వేచ్ఛకు సమాన గౌరవం దక్కే వరకూ స్త్రీ, పురుష సమానత్వం రాదు.

ఒక శతాబ్దకాలంగా సాగిన ప్రజాస్వామిక, స్త్రీవాద ఉద్యమాల కృషి ఫలితంగా స్త్రీలకు కొన్ని హక్కులు, చట్టాలు రూపొందాయి. వీటిని మనం వ్యాఖ్యానించుకొనేటప్పుడూ, అమలు చేసుకొనేటప్పుడూ వివిధ ప్రజా సమూహాల అర్హతల గురించీ, వారి సామాజిక స్థానాన్ని గురించీ మనకున్న అభిప్రాయాల ప్రభావం బలంగా పనిచేస్తుంది. సాధారణ ప్రజల్నే కాదు చట్టాల్ని అమలుచేసే అధికారులను, న్యాయమూర్తులతో సహా ఇది ప్రభావితం చేస్తుంది. ఈనాటికీ ఈ అభిప్రాయాలను హైందవధర్మం అనే భావన ఎక్కువగా నిర్దేశిస్తుందనేది నిస్సందేహమైన విషయం. అంతేకాక చట్టానికి వెలుపల జరిగే న్యాయాన్యాయాల నిర్ణయం (కుటుంబం నాలుగుగోడల మధ్య కావచ్చు, ఊరి రచ్చబండ దగ్గర కావచ్చు) సాంప్రదాయక భావజాలం చేతనే ఎక్కువగా ప్రభావితం అవుతుందనేది కూడా నిస్సందేహమైన విషయమే.

ఇప్పుడు మనం ఎంచుకున్న అభివృద్ధి నమూనా సమత, సమానత్వ భావనలకి పూర్తిగా వ్యతిరేకమైనది. దీని ప్రకారం సమాజం అంతటికీ చెందాల్సిన

"పాఠం ఒప్ప చెప్పకపోతే పెళ్ళి చేస్తాన"ని / పంతులుగారన్నప్పుడే భయమేసింది
"ఆఫీసులో నా మొగుడున్నాడు! / అవసరమొచ్చినా సెలవివ్వడ"ని / అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది
"వాడికేం? మగమహారాజ"ని / ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది / "పెళ్ళ"ంటే "పెద్దశిక్ష" అని / "మొగుడ"ంటే "స్వేచ్ఛా భక్షకుడ"ని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే / మమ్మల్ని విభజించి పాలిస్తోందని!

**– సావిత్రిగారి కవిత 'బందిపోట్లు'**

వనరులను త్వరితగతిన లాభంగా మార్చే కార్పొరేషన్లకు ధారాదత్తం చేయాలి. అప్పుడే 'అభివృద్ధి' వేగంగా వస్తుంది. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం గురించి ప్రయత్నించడం దండగ. వనరులపైన గుత్తాధిపత్యం పొందిన కార్పొరేట్లు తినగా మిగిలిన దానితో ప్రజలు తమ బతుకుదెరువు చూసుకోవచ్చు. ప్రభుత్వాలు చెయ్యాల్సిందల్లా ఈ వనరులను కట్టబెట్టడానికి కావలసిన చట్టాలు చేయడం. ఎక్కడైనా ప్రజలు వ్యతిరేకిస్తే పోలీసు, సైన్యాన్ని ఉపయోగించి వారిని అణచివేయడం. ఇదే నిజమైన అభివృద్ధి అనే భావనను పెంపొందించే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వాతావరణం కల్పించడం, దానిని కొనసాగించడం.

ఈ నమూనా వివిధ ప్రజాసమూహాలను అభద్రతా భావనలోనికి నెట్టి ఒకరిపై ఒకరికి వైషమ్యాలు కల్పించి, భౌతికమైన దాడులకు కూడా పాల్పడేలా చేస్తుంది. అటువంటి పరిస్థితులు లేని చోట మావోయిస్టులనో, పాకిస్తాన్ టెర్రరిజాన్నో బూచిగా చూపించి ప్రజలపైన యుద్ధం ప్రకటిస్తుంది. ఇటువంటి సందర్భాలలో ప్రజానీకంపై అణచివేతతో పాటు స్త్రీలపై సాయుధ దళాల లైంగికదాడులు సాధారణ విషయం అయిపోయింది. ఈ నమూనాను నిర్దాక్షిణ్యంగా ముందుకు తీసుకువెళ్ళడంలో హిందూత్వ భావజాలం ఇప్పుడు ముఖ్యపాత్ర పోషిస్తుంది.

రాజకీయ, సైద్ధాంతికరంగాల్లో గానీ, ప్రజాఉద్యమాల్లో గానీ పురుషులే పెత్తనం చెలాయించడం బహుశా ఈనాటి ఈ పరిస్థితులకు చాలా వరకు కారణం కావచ్చు. ఆయా రంగాల్లో స్త్రీల భాగస్వామ్యం కూడా తగిన స్థాయిలో ఉంటేనే ఇప్పుడు మన సమాజం ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలకు సరైన పరిష్కారాలను వెతుక్కోగలం. సమానత్వ భావనను సూత్రప్రాయంగా అంగీకరించి ఊరుకోకుండా ఆచరణలో (వ్యక్తిగతంగా కావచ్చు, సామాజికంగా కావచ్చు) ఎలా పెంపొందించుకోవచ్చో ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలిసి మాట్లాడుకుందాం!

## సభ

**2018 మార్చి, 11 ఆదివారం ఉదయం 10 గంటలకు; గాంధీభవన్, కాకినాడ**

మీరా సంఘమిత్ర, కన్వీనర్, ప్రజా ఉద్యమాల జాతీయవేదిక
జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు, జైభారత్ మహిళా ప్రగతిశీల సంఘం
కొంకి రాజామణి, కన్వీనర్, దళిత బహుజన మహిళాశక్తి
పుట్ల హేమలత, రాష్ట్ర అధ్యక్షురాలు, ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక

**–మానవ హక్కుల వేదిక,**
తూర్పు గోదావరి

***స్త్రీల హక్కులన్నీ మానవ హక్కులే,***
***ఏ హక్కుకూ విఘాతం కలగడాన్ని స్త్రీలు సహించి ఊరుకోకూడదు***

---

*ప్రచురణ కర్త: గౌరవ్, కార్యదర్శి, మానవ హక్కుల వేదిక, 8074322748*